క్లుప్తంగా

అంతర్జాతీయ బాలల దినోత్సవం



జడ్చర్ల టౌన్: అంతర్జాతీయ బాలల దినోత్సవం పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వర్ష కల్చరల్ అకాడమి, సంస్కారభారతి సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. కేక్ కట్‌చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో వర్ష, గోనెల రాధాకృష్ణ, కృష్ణవేణి, రణధీర్ పాల్గొన్నారు.

దుర్గావాహిని ఆధ్వర్యంలో ర్యాలీ



భూత్పూర్: పట్టణంలోని చౌరస్తాలో శనివారం దుర్గావాహిని ఆధ్వర్యంలో బాలికలు ర్యాలీ నిర్వహించారు. దండ ప్రయోగం, నీయుద్ధ, చూరిక, కోలాటాలు, ఘన సంపదలు, ఆత్మరక్షణ విద్యలను యువతులు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో దుర్గావాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాలయ భూమి కౌలు పొందేందుకు వేలం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): దేవరకద్ర నియోజకవర్గం డోకూర్‌లో 265, 266, 272, 542 సర్వేనంబర్‌లలో 7 ఎకరాల 19 గుంటల భూమి కబ్జాకాకుండా దేవాదాయ భూమిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసుదన్‌రెడ్డి కృషితో కాపాడినట్లు డీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి డోకూర్ భీంరెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. అందుకు సంబంధించి కౌలు కింద వ్యవసాయం చేసుకోవడానికి ఈనెల 13న వేలం డోకూర్ ప్రజల సమక్షంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

క్రీడలు క్రమశిక్షణ పెంపొందిస్తాయి



నవాబుపేట: క్రీడలు యువతలో మంచి క్రమశిక్షణ అలవర్చుకునేలా దోహదపడతాయని తహసీల్దార్ నాన్యనాయక్ తెలిపారు. శనివారం మండలంలోని గురుకుంటలో నేషనల్ అథ్లెట్ బద్రి ఆధ్వర్యంలో నెల రోజుల పాటు సమ్మర్ కోచింగ్ శిబిరం నిర్వహించారు. శనివారం ముగింపు సందర్భంగా తహసీల్దార్, ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, ఎంపీపీ అనంతయ్య హాజరయ్యారు. అనంతరం సమ్మర్ క్యాంపులో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలు, బహుమతులు అందించారు.

నేడు ఉద్యమకారులకు సన్మానం

నవాబుపేట: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహచారి తెలిపారు. రాష్ట్రం కోసం ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన ఉద్యమకారులతో పాటు ఉద్యమానికి ఊతాన్నిచ్చిన జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులందరికి సన్మానం చేస్తున్నట్లు వివరించారు.

వాహనం బోల్తా



అడ్డాకుల: జాతీయ రహదారిపై మండల కేంద్రం శివారులో రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు ముప్పు తప్పిపోయింది. శంషాబాద్ నుంచి రఘురెడ్డి బొలెరో గూడ్స్ వాహనంలో వాటర్ బాటిళ్లను శనివారం ఉదయం కొత్తకోటకు తీసుకెళ్తున్నాడు. అడ్డాకుల దాటిన తర్వాత పెట్రోల్ బంక్ సమీపంలో వాహనం టైరు పగిలిపోయింది. దీంతో అదుపు తప్పిన కొంత దూరం డివైడర్ పైకి దూసుకెళ్లి బోల్తాపడింది. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ రఘురెడ్డి అదృష్టవశాత్తు ఎలాంటి గాయాలు కాకుండా ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడ్డాడు. ట్రాలీలో ఉన్న వాటర్ బాటిళ్లు కిందపడ్డాయి. రోడ్డు నిర్వాహకులు బోల్తాపడిన వాహనాన్ని అక్కడి నుంచి తీశారు. తర్వాత మరో ట్రాలీ ఆటోలో వాటర్ బాటిళ్లను కొత్తకోటకు తరలించారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

- మట్టిని కరిగిస్తు కృత్రిమ ఇసుక తయారీ
- ఖాళీ అయిన దుందుభీవాగు



రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో పట్టుబడ్డ ఇసుక టిప్పర్లు, ట్రాక్టర్లు, జేసీబీ (ఫైల్)



దుందుభీవాగులో ట్రాక్టర్‌లోనే మట్టిని కడుగుతున్న ఇసుక మాఫియా

రాజాపూర్: మండల శివారులో ఉన్న దుందుభీ వాగు పరిసర ప్రాంతంలో ఉన్న మల్లేపల్లి, చెన్నవెల్లి, కుచ్చర్‌కల్, కుత్నేపల్లి, దొండ్లపల్లి, తిర్మలాపూర్, రాజాపూర్, నందిగామ, ముదిరెడ్డిపల్లిలో ఉన్న ఇసుకను ఎప్పుడో తోడేశారు. ఇసుక లేకపోవడంతో కొత్త రకంగా కృత్రిమ ఇసుకను తయారు చేస్తున్నారు. మండలంలో ఇసుక నిషేధం ఉన్నప్పటికి ఇసుక అక్రమ రవాణాకు అలవాటుపడ్డ మాఫియా పగలు ఇసుక ఫిల్టర్‌లలో మట్టినితోడి నీటిలో కడిగి ఇసుకను తయారు చేసి పగలు రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తు రాత్రి వేళల్లో టిప్పర్‌లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. పోలీసులు అడపాదడపా కేసులు నమోదు చేస్తున్నప్పటికి, జరిమానాలు వేస్తున్నా ఇసుక మాఫియా మాత్రం తమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు.

భూములను కొనుగోలు చేసి..

వాగులో ఇసుక లేకపోవడంతో పరిసర ప్రాంతాల్లోని రైతుల వద్ద సీలింగ్, పట్టా భూములను కొందరు ఎకరం భూమిని రూ.50లక్షలకుపైగా కొనుగోలు చేశారు. అందులోని మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించి రహస్యంగా ఇసుక ఫిల్టర్‌లను ఏర్పాటు చేసి మట్టిని కడిగి ఇసుక తయారు చేస్తున్నారు.

గ్రామాల్లో యువకులకు సైతం మామూళ్లు..

రాత్రివేళల్లో ఇసుక మాఫియా తమ టిప్పర్లలో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండటంతో గ్రామాల్లో కొందరు యువకులు అదేపనిగా రాత్రి వేళల్లో ఒక్కో టిప్పర్‌కు డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకునేందుకు రెవెన్యూ శాఖలో వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు సైతం లేకపోవడంతో ఎవరైన తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే ఉన్న మహిళ ఆర్‌ఐని అక్కడి పంపించి ఇసుక ట్రాక్టర్‌లను, టిప్పర్‌లను అడ్డుకుంటే ఆమెను బెదిరించి తమ వాహనాలను తీసుకెళ్లిన ఘటనలు కూడా ఉన్నాయి.

చర్యలు తీసుకుంటున్నాం..



ఇసుక అక్రమ రవాణా ఎక్కడైన చేస్తున్నారంటే తమకు సమాచారం వస్తే వెంటనే తమ సిబ్బందిని పంపించి అడ్డుకుంటున్నాం. ఇసుక డంపులు సీజ్ చేస్తున్నాం. కేసులు నమోదు చేయిస్తున్నాం. – విద్యాసాగర్‌రెడ్డి, తహసీల్దార్, రాజాపూర్

కేసులు నమోదు చేస్తున్నాం..



మండలంలో ఇసుక తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నాం. ఈ మూడు నెలలలో 18 కేసులు నమోదు చేశాం. జడ్చర్ల మండలం కోడ్గల్, లింగంపేట్ శివారుల్లోని దుందుబీ వాగు నుంచి గ్రామస్తులు అందరూ ఏకతాటిపై ఉండి వాగులో ఇసుక రవాణా అడ్డుకోవాలి. గ్రామంలో ఇంటి నిర్మాణానికి ఇసుక కావాలన్నా గ్రామస్తుల తీర్మాణంతోనే తీసుకుంటారు. – రవి, ఎస్‌ఐ, రాజాపూర్

వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ఆరా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వర్షాకాలం ఆరంభవుతున్నందున స్థానిక మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్ శనివారం పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా 27వ వార్డు పరిధిలోని ఎర్రకుంటను పరిశీలించారు. లోతట్టు ప్రాంతాలైన కుర్విని శెట్టికాలనీ, రాయచూర్ రోడ్డు సమీపంలో నాలాల పరిస్థితిపై ఆరా తీశారు. 19వ వార్డులోని శిథిలావస్థలో ఉన్న మురుగు కాల్వను పరిశీలించి మరమ్మతు చేపట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. 10వ వార్డులోని విఘ్నేశ్వరకాలనీలో మురుగు కాల్వలను పరిశీలించారు. అనంతరం పెద్దచెరువులోకి వరదనీటి మళ్లింపు పనులను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో కౌన్సిలర్లు జాజిమొగ్గ నర్సింహులు, రాంలక్ష్మణ్, ఏఈలు వైష్ణవి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.



27వ వార్డులో నాలాను పరిశీలిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్

అనుమతి ఉన్న విత్తనాలనే కొనండి



భూత్పూర్: రైతులు ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలనే కొనుగోలు చేయాలని మండల విస్తరణ అధికారి హర్ష అన్నారు. శనివారం మున్సిపాలిటీలోని అమిస్తాపూర్‌లో వర్షాకాలంలో విత్తనాల కొనుగోలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు లూజు విత్తనాలు కొనరాదని, వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని వివరించారు. డీలర్ వద్ద తప్పకుండా రశీదు తీసుకోవాలని, ప్యాకెట్లు, బిల్లులు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా దాచుకోవాలని సూచించారు. ప్యాకెట్‌పై విత్తనాలు తయారీ తేదీ, కాలం ముగింపు, సంవత్సరం గుర్తించి కొనుగోలు చేయాలని చెప్పారు. గ్రామాల్లో తక్కువ ధరకు లూజు విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వ్యవసాయాధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

‘ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రాజాపూర్: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై బీఆర్‌ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కొద్దిరోజుల క్రితం ఎమ్మెల్యేపై ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే అనుమతులు లేకుండా మొరం కొట్టించుకున్నాడని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారని అన్నారు. ఈ విషయంపై గ్రామానికి చెందిన కొందరితో తెరవెనుక రాజకీయాలు చేయాలనే నాయకుడు ఇటువంటివి మానుకోవాలని హెచ్చరించారు. బాలానగర్ మండలంలో జరిగిన విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు రాజాపూర్ మండలంలో చిచ్చు పెట్టాలని చూడటం సిగ్గుచేటని అన్నారు. ఎమ్మెల్యే తన సొంత వ్యవసాయపొలంలో గుర్రాలకోసం వేసిన షెడ్డులకు పంచాయతీ నుంచి అనుమతులు తీసుకుని రూ.29వేల చలాన్ కట్టి మొరం వేయించారన్నారు. సమావేశంలో విక్రంరెడ్డి, యాదయ్య, శంకరయ్య, మల్లేష్, కాంత్‌రెడ్డి, నసీర్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యమకారులను విస్మరించిన కేసీఆర్’



స్టేషన్ మహబూబ్‌నగర్: పదేళ్లపాలనలో తెలంగాణ ఉద్యమకారులను కేసీఆర్ విస్మరించారని, కానీ ఉద్యమద్రోహులకు స్థానం ఇచ్చినప్పుడూ మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఎందుకు అప్పట్లో మాట్లాడలేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ఫాంహౌస్‌లో కూర్చొని ఉద్యమకారులను కలిసే అవకాశం ఇవ్వలేదని, గద్దర్‌ను మూడు గంటలపాటు నిల్చొ పెట్టినప్పుడూ మాజీ మంత్రి ఎందుకు ప్రశ్నించలేదన్నారు. మాజీ మంత్రి సలహాలు కాంగ్రెస్ ప్రభుత్వానికి అవసరం లేదన్నారు. అందేశ్రీని గౌరవించడంతోపాటు గీతాన్ని అధికారికంగా ప్రకటిస్తున్నామని, దీనిని స్వాగతించాల్సింది పోయి విమర్శలు చేయడం సరికాదన్నారు. బతుకమ్మ పాటకు ఏఆర్ రహెమాన్ సంగీతం చేసిన విషయాన్ని మరిచిపోవద్దన్నారు. మాజీ మంత్రి పదేళ్లలో ఉద్యమకారులను గౌరవించి పదవులు ఇచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పుడున్నది సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వమని అన్నారు. అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. మహబూబ్‌నగర్ అంటే గుర్తుచ్చే పిల్లలమర్రిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కేసీఆర్ పార్క్‌లో ఏమీ లేదని, 120 ఎకరాల పెద్దచెరువును 60 ఎకరాలకు చేశారని, వీటిపై విచారణ చేయిస్తామని తెలిపారు. సమావేశంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

విరిగిన స్తంభాలకు మరమ్మతులేవీ?

భూత్పూర్: మండలంలోని పాత మొల్గర శివారులోని వ్యవసాయ పొలాల్లో వారం రోజుల క్రితం ఈదురు గాలులతో కూడిన వర్షాలకు స్తంభాలు పడిపోయాయి. పాత మొల్గర శివారులోని పల్లెగడ్డ వద్ద 66 మంది రైతులకు చెందిన వ్యవసాయ పొలాలు ఉన్నాయి. రెండు స్తంభాలు నేలపై పడిపోగా, మూడు స్తంభాలు ఒరిగినట్లు రైతులు చెప్పారు. వరినార్లు చల్లుకోవడానికి కొద్ది రోజులు మాత్రమే ఉండటంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని రైతులు చెబుతున్నారు. పనులు ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు అప్పజెప్పడంతో స్తంభాలు నేలకొరిగినా, కింద పడిపోయిన, కొత్తగా కరెంట్ స్తంభాలు వేయాలన్నా పనులు ఆలస్యం అవుతున్నాయి. ఈ విషయమై లైన్‌మన్ బాలును వివరణ కోరగా కాంట్రాక్టర్ స్తంభం పాతారని, త్వరలో విద్యుత్ సరఫరా చేసేలా కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెస్తామని అన్నారు.



పాత మొల్గర సమీపంలో పడిపోయిన స్తంభం

ధర్మప్రచారం విస్తృతంగా చేయాలి



ప్రవచనం ఇస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

జడ్చర్ల టౌన్: సృష్టి పుట్టిన నాటినుంచి సనాతన ధర్మం ఉందని, అందుకే ధర్మ ప్రచారం విస్తృతంగా చేయాలని ప్రముఖ ప్రవచన కర్త బ్రహ్మశ్రీసామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో వేదాల గురించి వివరించారు. వేదం భగవంతుడి నుంచి వచ్చిందన్నారు. వేదములు, పురాణాలు, ఇతిహాసమైన మహాభారతం, మహాకావ్యమైన రామాయణం జాతిసంపదగా, సనాతన ధర్మం యొక్క సంపదలుగా అభివర్ణించారు. గ్రంథాల్లో వేటిలో చూసినా ధర్మం అంటే ఏమిటో తెలుస్తుందన్నారు. మానవుడు ఏవిధంగా బతికితే వాడికి క్షేమమో అదియే ధర్మమన్నారు. అనంత జ్ఞానానికి మనం వారసులమని, సనాతన ధర్మానికి చెందినవారమని సగర్వంగా చెప్పుకోవాలన్నారు. ప్రపంచంలో మతము, ధర్మము అని మంచి మాటలు ఏవి వినపడ్డ వాటన్నింటి మూలం సనాతన ధర్మం నుంచి లభిస్తుందన్నారు. స్వామి వివేకానందుడు సనాతన ధర్మం యొక్క గొప్పతనాన్ని విదేశస్తులకు వివరిస్తే వారు విచ్చుకున్న మనసులతో విని, తెలుసుకుని ప్రపంచంలోని మేధావులు దీనిలోని ధర్మాన్ని, జ్ఞానాన్ని అనుసరిస్తున్నారన్నారు. ప్రవచనంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో శివకుమార్, శంకర్‌బాబు, వేణుగోపాల్, విజయ్‌కుమార్, రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, శివ్వరేఖ, పద్మలీల, లక్ష్మీనారాయణ, దత్తుకుమార్, మంచన విఠలయ్య హాజరయ్యారు.



ప్రవచనానికి హాజరైన పట్టణ ప్రజలు

చిన్నచింతకుంట ఎంఈఓపై ఫిర్యాదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మద్దూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన హెచ్‌ఎం రవీంద్రప్పపై ఇటీవల చిన్నచింతకుంట ఎంఈఓ ఎం.లక్ష్మణ్‌సింగ్ దురుసుగా ప్రవర్తించినందుకు చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కె.రవికుమార్ డిమాండ్ చేశారు. వారు శనివారం కలెక్టరేట్‌లోని డీఈఓ రవీందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గత నెల 29న పాఠశాలలో పనులను పర్యవేక్షించేందుకు వెళ్లి అక్కడి హెచ్‌ఎంపై ఎంఈఓ దుర్భాషలాడారని పేర్కొన్నారు. గతంలోనూ ఈయన చిన్నచింతకుంట, కోయిలకొండ మండలాల్లో ఉపాధ్యాయులను అవమానపరిచేలా ప్రవర్తించారన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యం

కోయిల్‌కొండ: అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కనాయపల్లిలో ఆంజనేయ సహిత హరిహరక్షేత్రము పుష్కరోత్సవం కార్యక్రమానికి హాజరై ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిఒక్కరు భక్తిభావంతో మెలగాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతినిరుపేదకు సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని అన్నారు. అనంతరం దమాయపల్లిలో విద్యుత్ షాక్‌కు గురైన నరేష్‌ను మహబూబ్‌నగర్ ప్రైవేట్ ఆస్పత్రిలో పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట రాజునాయక్, సత్యపాల్‌రెడ్డి, థావుర్యానాయక్, మనోజ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



హనుమాన్‌చాలీసా పారాయణంలో చిన్నారులు



జడ్చర్లలో పవన హోమం చేస్తున్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం పెద్దశివాలయం సమీపంలోని సరస్వతీ శిశుమందిరంలో శనివారం భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీవీపీ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. బీవీపీ పాలమూరుశాఖ అధ్యక్షుడు భూషణ్‌పాండే విద్యార్థులకు హనుమాన్‌చాలీసా పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతినిత్యం హనుమాన్‌చాలీసా పారాయణం చేసి ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాంరెడ్డి, పాండురంగం, రమేష్‌చందర్, చంద్రుడు, వెంకటేశ్వర్ గుప్త, యతిరాజాచారి, డీకే.ఆంజనేయులు, రాజేంద్రకుమార్, మాధవాచారి, నాగేంద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్: హనుమాన్ జయంతి పురస్కరించుకుని మండలంలోని అన్ని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలోని షిరిడిసాయి దేవాలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేశారు. పవనహోమం జరిపించి అన్నదానం నిర్వహించారు. పాతబజార్ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు ఆకుపూజ, చందూరం పూజలు చేశారు. నాగసాల ఆంజనేయ స్వామి ఆలయం, గాంధీనగర్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు చేశారు.



అప్పంపల్లిలో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు

చిన్నచింతకుంట: మండల కేంద్రం, కురుమూర్తి, అప్పంపల్లిలో ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామివారికి అభిషేకం, కలశపూజ, ఆకులపూజతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు చేశారు.

బలీదుపల్లిలో వార్షికోత్సవ పూజలు



బోనాలను ఊరేగిస్తున్న మహిళలు



పూజలు చేస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మండలంలోని బలీదుపల్లిలో శనివారం వార్షికోత్సవ పూజలను నిర్వహించారు. గతేడాది గ్రామంలోని దేవాలయంలో గణపతి, లోకేశ్వర, సీతారాములు, కురుమూర్తి దీప స్తంభం, గ్రామ దేవత ప్రతిష్ఠ కార్యక్రమాన్ని చేపట్టిన నేపథ్యంలో ఆలయంలోని విగ్రహాలకు గ్రామస్తులు అభిషేకాలు చేశారు. గ్రామ దేవతకు మహిళలు బోనాలను సమర్పించారు. బోనాలతో మహిళలు ప్రధాన వీధుల్లో ఊరేగింపు చేపట్టారు. తర్వాత బొడ్రాయి చుట్టూ ప్రదక్షిణ చేసి వాటిని సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయం వద్ద గ్రామస్తులకు అన్నదానం చేశారు.

క్రీడాకారుడికి ఆర్థికసాయం



కోయిల్‌కొండ: అండర్–19 నేషనల్ స్థాయి పరుగు పందెంలో ప్రథమస్థానం దక్కించుకున్న వింజామూర్ చెందిన క్రీడాకారుడు నర్సింహులుకు గ్రామంలోని పలువురు దాతలు రూ.40వేల ఆర్థిక సాయం శనివారం అందించారు. ఈనెల 18 నుంచి 26వ తేదీ వరకు నేపాల్‌లో జరిగే నేషనల్ పోటీలలో ప్రతిభ కనబర్చి గోల్డ్‌మెడల్ సాధించి గ్రామానికి, దేశానికి మంచి పేరు తీసుకరావాలని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోడూర్ చెందిన గీత కార్మికుడు రాజేందర్‌గౌడ్ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధులు రూ.20వేలు ఆర్థిక సాయం చేశారు. శనివారం మృతుడి భార్యకు అందజేశారు. కార్యక్రమంలో కేశవులుగౌడ్, సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంఈఓకు యూనిఫాం అందజేత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు కొత్త యూనిఫాం కుట్టే పని వేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా పట్టణంలోని ఆరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు చెందిన 203 జతలను శనివారం ఎంఈఓ జయశ్రీకి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీఎంసీ శివకుమార్‌గౌడ్, సీఓ యాదయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సంజయనగర్ ప్రభుత్వ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు.